AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
22-1-2026 (Thursday) MAIN EDITION

## మేడారంలో హెలికాప్టర్ రైడ్స్ ప్రారంభం




**అక్షరటుడే, హైదరాబాద్:** మేడారం మహాజాతర నేపథ్యంలో వారం రోజుల ముందు నుంచే మేడారం భక్తులు తరలివస్తున్నారు. దీంతో భారీగా రద్దీ నెలకొంది. మేడారంలో సమ్మక్క సారక్క జాతర ఈ నెల 28 నుంచి 31వరకు జరగనుంది. ఈ మేరకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. భారీగా భక్తులు తరలి రానుండడంతో ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అయితే భక్తుల కోసం హెలికాప్టర్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. గురువారం హెలికాప్టర్ రైడ్స్ ప్రారంభించారు. పడిగాపూర్ వద్ద హెలిప్యాడ్ ఏర్పాటు చేశారు. భక్తులను 6 నుంచి 7 నిమిషాలు హెలికాప్టర్‌లో తిప్పనున్నారు. జాయ్ రైడ్‌కు ఒక్కొక్కరికి రూ.4,800 ఛార్జ్ చేయనున్నారు.

## ఎన్‌కౌంటర్‌లో పది మంది నక్సల్స్ హతం




**అక్షరటుడే, జార్ఖండ్:** మావోయిస్ట్‌లకు మరో ఎదురుదెబ్బ తగిలింది. జార్ఖండ్ సారండా అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో తాజాగా పది మంది నక్సల్స్ హతమయ్యారు. జార్ఖండ్‌లోని పశ్చిమ సింగ్‌భూమ్ జిల్లాలోని సారండా అడవుల్లో గురువారం ఉదయం ఎదురు కాల్పులు చోటు చేసుకున్నాయి. కమాండో బెటాలియన్ ఫర్ రిసొల్యూట్ యాక్షన్ (కోబ్రా) 209 బెటాలియన్ నేతృత్వంలోని భద్రతా దళాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోయిస్టులు కనిపించడంతో కాల్పులు చోటు చేసుకున్నాయి.

## లోయలో పడిన ఆర్మీ వాహనం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జమ్మూ కశ్మీర్ రాష్ట్రంలో ఆర్మీ వాహనం లోయలో పడింది. ఈ ఘటనలో పది మంది జవాన్లు చనిపోయారు. పలువురు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఉధాంపూర్‌లోని ఆర్మీ ఆస్పత్రికి తరలించారు. 200 అడుగుల లోయలో ఆర్మీ వాహనం పడిపోయింది. దీంతో పది మంది జవాన్లు మరణించారు.

## టీవీకే పార్టీకి 'విజిల్' సింబల్




**అక్షరటుడే, చెన్నై:** తమిళ నటుడు విజయ్ టీవీకే పార్టీకి ఎన్నికల సంఘం గుర్తు కేటాయించింది. మరికొన్ని నెలల్లో ఆ రాష్ట్రంలో ఎన్నికలు జరగనున్నాయి. అన్నిస్థానాల్లో పోటీ చేస్తామని టీవీకే ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల సంఘం టీవీకే పార్టీకి 'విజిల్' గుర్తును గురువారం కేటాయించింది.

## కర్ణాటక అసెంబ్లీలో గందరగోళం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కర్ణాటక అసెంబ్లీలో గందరగోళం నెలకొంది. జీ-రామ్-జీ పథకం ప్రసంగంపై వివాదం చెలరేగింది. సభలో ప్రసంగించకుండా గవర్నర్ వెళ్లిపోయారు. ప్రభుత్వం ఇచ్చిన కాపీ జీ-రామ్-జీ బిల్లుకు వ్యతిరేకంగా ఉందని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో గవర్నర్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ ఎమ్మెల్యేల నినాదాలు చేశారు.



## గాయని జానకి కుటుంబంలో విషాదం..

**అక్షరటుడే, హైదరాబాద్:** ప్రముఖ సీనియర్ గాయని ఎస్.జానకి ఇంట తీవ్ర విషాదం నెలకొంది. ఆమె కుమారుడు మురళీకృష్ణ కన్నుమూశారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న మురళీకృష్ణ గురువారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. 65 సంవత్సరాల వయసులో ఆయన మరణం జానకి కుటుంబానికే కాకుండా సినీ వర్గాలు, అభిమానుల్లో కూడా తీవ్ర ఆవేదనను మిగిల్చింది. మురళీకృష్ణ మరణంపై పలువురు ప్రముఖులు సంతాపం ప్రకటించారు.

## ఏఐపై బిల్ గేట్స్ కీలక హెచ్చరికలు..

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు, ప్రపంచ ప్రఖ్యాత టెక్ దిగ్గజం బిల్ గేట్స్ కృత్రిమ మేధస్సుపై ప్రపంచ దేశాలకు తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. రాబోయే కొద్ది సంవత్సరాల్లోనే ఏఐ ప్రభావంతో ఉద్యోగ మార్కెట్‌లో, ముఖ్యంగా వైట్ కాలర్ రంగంలో ఊహించని స్థాయిలో మార్పులు చోటు చేసుకుంటాయని ఆయన అన్నారు. ఈ పెను మార్పులను ఎదుర్కొనేందుకు చాలా దేశాల ప్రభుత్వాలు ఇప్పటికీ సరైన సన్నాహాలు చేయలేదని గేట్స్ ఆందోళన వ్యక్తం చేశారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక ఫోరమ్ సదస్సు సందర్భంగా ఎన్డీటీవీకి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో బిల్ గేట్స్ ఈ విషయాలను వెల్లడించారు.

## యూకో బ్యాంక్‌లో ఆఫీసర్ కొలువులు..

**అక్షరటుడే, ఎడ్యుకేషన్ డెస్క్:** ప్రభుత్వ రంగ సంస్థ అయిన యూకో బ్యాంక్ పలు పోస్టుల భర్తీ కోసం చర్యలు చేపట్టింది. జనరలిస్టిక్, స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. జేఎంజీఎస్I, ఎంఎంజీఎస్II స్కేల్‌లలో రెగ్యులర్ ప్రాతిపదికన ఆయా పోస్టులను భర్తీ చేయనుంది. మొత్తం 173 పోస్టులను భర్తీ చేయనున్నారు. ఫిబ్రవరి 2 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.



సింగరేణి యాజమాన్యం కీలక నిర్ణయం తీసుకుంది. నైనీ కోల్ మైన్స్ టెండర్ నోటిఫికేషన్ రద్దు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పరిపాలనా పరమైన కారణాలతో నోటిఫికేషన్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ బొగ్గు గనుల విషయంలో అనేక ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. సైట్ విజిటింగ్ సర్టిఫికెట్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. ఈ నేపథ్యంలో సింగరేణి సంస్థ గురువారం టెండర్లను రద్దు చేసింది.

—అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి

# నైనీ కోల్ మైన్స్ టెండర్లు రద్దు

▸ అవినీతి ఆరోపణల నేపథ్యంలో.. ▸ సింగరేణి కీలక నిర్ణయం ▸ సైట్ విజిటింగ్ సర్టిఫికెట్‌పై విమర్శలు ▸ కేంద్రం నిలదీయడంతో వెనక్కి తగ్గిన సంస్థ

కోల్ లింకేజీలో భాగంగా సింగరేణికి ఒడిశా రాష్ట్రం అంగుల్ జిల్లాలోని నైనీ బొగ్గు గని దక్కింది. ఈ మైన్‌లో తవ్వకాలు, బొగ్గు ఉత్పత్తి పనులకు సంస్థ టెండర్లు ఆహ్వానించింది. అయితే టెండర్ వేసే సంస్థ విధిగా ఆ సైట్‌ను సందర్శించాలని, సందర్శించినట్లు సింగరేణి ధ్రువీకరణ పత్రం ఇవ్వాలనే నిబంధన పెట్టింది. దీనిపై అనేక ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ పెద్దలకు అనుకూలంగా ఉండేవారికి టెండర్లు కట్టబెట్టడానికి సైట్ విజిట్ సర్టిఫికెట్ విధానం తెచ్చారని బీఆర్ఎస్ ఆరోపించింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కపై ఈ టెండర్ల విషయంలో ఓ పత్రికలో వార్తలు ప్రచురితం అయ్యాయి. దీంతో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. టెండర్లు రద్దు చేస్తామని ప్రకటించారు. ఈ మేరకు తాజాగా ఈ టెండర్ నోటిఫికేషన్ రద్దు చేస్తూ సింగరేణి నిర్ణయం తీసుకుంది.

### డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు..

నైనీ కోల్‌మైన్స్ టెండర్ల విషయంలో డిప్యూటీ సీఎం భట్టిపై ఆరోపణలు వచ్చాయి. దీంతో ఆయన ఆ రోజే టెండర్లు రద్దు చేయాలని అధికారులకు సూచించారు. ఇతర ప్రభుత్వ రంగ బొగ్గు సంస్థలు ఏ నిబంధనలు విధించాయో అధ్యయనం చేసి.. తిరిగి టెండర్లు పిలవాలని ఆదేశించారు. ఈ మేరకు తాజాగా సింగరేణి యాజమాన్యం టెండర్ ప్రక్రియను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకుంది. కాగా.. నైనీ బొగ్గు గనిలో బొగ్గు వెలికితీత, తరలించడం కోసం 25 ఏళ్ల కాలానికి రూ.1604.42 కోట్లతో సింగరేణి గతంలో టెండర్ నోటిఫికేషన్ ఇచ్చింది. టెండర్ కేటాయించడానికి గతంలో సాంకేతిక, ఆర్థిక సామర్థ్యాలు, అనుభవాన్ని తీసుకునేవారు. కానీ నైనీ బొగ్గు గని విషయంలో మాత్రం గనిని సందర్శించాలని పేర్కొనడం వివాదాలకు కారణమైంది.

### గతంలో సైతం..

నోటిఫికేషన్ ప్రకారం ఈరోజు సాయంత్రం 5 గంటల నుంచి నైనీ గనుల బిడ్స్ ప్రారంభం కావాల్సి ఉంది. అయితే పాలనాపరమైన కారణాలతో టెండర్ రద్దు చేస్తున్నట్లు ఎస్సీసీఎల్ ప్రకటించింది. నైనీ టెండర్ల విషయంలో సింగరేణి పాలకమండలిని కేంద్ర బొగ్గు గనుల శాఖ ప్రశ్నించింది. సంస్థ విధించిన నిబంధనలపై పాలకమండలి ఎందుకు చర్చించలేదని సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ ఆరా తీశారు. ఒకవేళ చర్చిస్తే.. టెండర్ల విషయంలో అవినీతి ఆరోపణలు ఎందుకు వస్తున్నాయని ప్రశ్నించారు. టెండర్ వేయదలచిన కంపెనీలకు ఎందుకు సైట్ విజిట్ ధ్రువీకరణ పత్రాలు ఎందుకు ఇవ్వడం లేదన్నారు. దీంతో టెండర్ల ప్రక్రియ ఇంకా ప్రారంభం కాలేదని సింగరేణి అధికారులు తెలిపారు. నిబంధనలు, టెండర్లపై పాలకమండలిలో చర్చించి మరోసారి నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.

## దావోస్‌లో డబ్ల్యూఈఎఫ్ ప్రతినిధులతో సీఎం కీలక సమావేశం



**అక్షరటుడే, హైదరాబాద్:** సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని బృందం దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం ప్రతినిధులతో కీలక సమావేశం నిర్వహించింది. హైదరాబాద్‌లో డబ్ల్యూఈఎఫ్ ఫాలో అప్ సమావేశాలు నిర్వహించాలని కోరింది. సీఎం రేవంత్ రెడ్డి దావోస్‌లో జరిగిన డబ్ల్యూఈఎఫ్ 2026 సదస్సు సందర్భంగా తెలంగాణ పెవిలియన్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక మేనేజింగ్ డైరెక్టర్ జెరెమీ జుర్గెన్స్, స్ట్రాటజిక్ ఇంపాక్ట్ అండ్ ఇంటిగ్రేషన్, సీ4ఐఆర్ నెట్‌వర్క్ హెడ్ మంజు జార్జ్‌లను కలిశారు. జులై లేదా ఆగస్టు నెలలో వార్షిక ఫాలోఅప్ డబ్ల్యూఈఎఫ్ సదస్సును హైదరాబాద్‌లో నిర్వహించాలని ప్రతిపాదించారు. తెలంగాణ అందించగల అద్భుతమైన అవకాశాలను, వనరులను ప్రపంచానికి చూపించాలని అనుకుంటున్నట్లు సీఎం తెలిపారు.

## చంద్రబాబుపై వైఎస్ జగన్ ఆగ్రహం



**అక్షరటుడే, ఏపీ:** ఏపీ సీఎం చంద్రబాబు నాయుడుపై వైసీపీ అధినేత జగన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. భూముల రీ సర్వేపై చంద్రబాబు క్రెడిట్ చోరీ చేస్తున్నారని విమర్శించారు. భూమండలం మీద ఇంత దారుణమైన క్రెడిట్ చోరీ చేయగలవారు ఎవరూ ఉండరని ఎద్దేవా చేశారు. జగన్ గురువారం మీడియాతో మాట్లాడారు. భూముల రీసర్వే చేయాలన్న కనీస ఆలోచన కూడా ఎప్పుడైనా వచ్చిందా అని బాబును ప్రశ్నించారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారమే రీ సర్వే అన్నారు. 2019 కంటే ముందు భూములు సర్వే చేసే టెక్నాలజీ లేదని చెప్పారు. భూములు రీ సర్వే చేయించాలని తన పాదయాత్రలో నిర్ణయించినట్లు జగన్ పేర్కొన్నారు. ఆ మేరకు 2019 ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చామన్నారు. రైతులకు, ప్రజలకు వివాదాలు లేనివిధంగా, పారదర్శకంగా భూములు సర్వే చేశామన్నారు. ట్యాంపరింగ్ చేయలేని విధంగా భూ యజమానులు, రైతులకు శాశ్వత పత్రాలు ఇచ్చామని జగన్ తెలిపారు.

## గ్రూప్–1పై తీర్పు వాయిదా..

**అక్షరటుడే, హైదరాబాద్:** గ్రూప్-1 నియామకాలపై హైకోర్టు తీర్పు వాయిదా వేసింది. దీంతో ఉద్యోగాలు సాధించిన వారితో పాటు అభ్యర్థుల్లో ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం గతంలో గ్రూప్-1 పరీక్షలు నిర్వహించిన విషయం తెలిసిందే. ఫలితాలపై కొందరు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం పరీక్షలను రద్దు చేస్తూ తీర్పు చెప్పింది. ఈ తీర్పుపై గ్రూప్-1 ర్యాంకర్లు, టీజీపీఎస్సీ డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించాయి. సింగిల్ బెంచ్ తీర్పుపై స్టే విధించిన ధర్మాసనం.. తుది తీర్పు మేరకు నియామకాలు జరగాలని స్పష్టం చేసింది. ఈ కేసులో ఇప్పటికే విచారణ ముగియడంతో గురువారం తీర్పు వెలువరించాల్సి ఉంది. అయితే తీర్పు ఇంకా రెడీ కాలేదని హైకోర్టు డివిజన్ బెంచ్ పేర్కొంది. ఇవాళ వెలువరించాల్సిన తీర్పును వచ్చేనెల 5కు వాయిదా వేసింది.

## గ్రీన్‌ల్యాండ్‌పై రష్యా అధ్యక్షుడి కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, నేషనల్‌డెస్క్:** రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ గ్రీన్‌ల్యాండ్ విషయంలో కీలక వ్యాఖ్యలు చేశారు. అది తమకు సంబంధం లేదని విషయమని స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల గ్రీన్‌ల్యాండ్‌ను స్వాధీనం చేసుకుంటానని వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. అక్కడ రష్యా, చైనా సైనిక కార్యకలాపాలను పెంచుతున్నాయనే కారణంతో దానిని అమెరికాలో విలీనం చేసుకోవాలని చూశారు. అయితే యూరప్ దేశాలు వ్యతిరేకించడంతో ఆ నిర్ణయంపై వెనక్కి తగ్గారు. తాజాగా గ్రీన్‌ల్యాండ్ విషయంలో పుతిన్ స్పందించారు. అమెరికా, దాని నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్) మిత్రదేశాలు ఈ విషయాన్ని తమలో తాము పరిష్కరించుకుంటాయన్నారు. గ్రీన్‌లాండ్‌కు సంబంధించి పెరుగుతున్న దౌత్య ఉద్రిక్తతలలో మాస్కో జోక్యం చేసుకునే ఉద్దేశం లేదని స్పష్టం చేశారు.

## ఆ అభిప్రాయం అందరిలో మారాలి..



**మహిళా ప్రాధాన్యం ఉన్న చిత్రాలపై ఇంకా అనుమానాలే ఎక్కువగా ఉన్నాయని, ఆ ఆలోచనా ధోరణి మారాల్సిన అవసరం ఉందని నటి మాళవిక మోహనన్ స్పష్టం చేశారు. కథానాయికలే కేంద్ర బిందువుగా తెరకెక్కే సినిమాలు వాణిజ్యపరంగా నిలబడవని పలువురు నిర్మాతలు ఇప్పటికీ భావిస్తున్నారని ఆమె వ్యాఖ్యానించారు. అయితే, ఈ అభిప్రాయానికి గట్టి సమాధానం చెప్పిన చిత్రాలు కూడా ఉన్నాయని మాళవిక గుర్తు చేశారు. గతేడాది విడుదలై సంచలన విజయం సాధించిన చిన్న చిత్రాల్లో 'కొత్తలోక: చాప్టర్ 1' ఒకటిగా నిలిచింది. ఈ సినిమా విజయాన్ని ప్రస్తావిస్తూ మహిళా ప్రధాన చిత్రాలపై నిర్మాతల దృష్టికోణం మారాల్సిన అవసరం ఉందన్నారు.**

- అక్షరటుడే, సినిమాడెస్క్

## బస్సు‌లారీ ఢీ, ముగ్గురు మృతి

**అక్షరటుడే, ఏపీ:** నంద్యాల జిల్లా శిరివెళ్ల మండల పరిధిలోని శిరివెళ్లమెట్ట వద్ద అర్ధరాత్రి జరిగిన ఘోర ప్రమాదంలో ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. నెల్లూరు నుంచి హైదరాబాద్‌కు 36 మంది ప్రయాణికులతో బయల్దేరిన ఏఆర్‌బీసీవీఆర్ ప్రైవేట్ ట్రావెల్స్‌కు చెందిన బస్సు బుధవారం అర్ధరాత్రి రెండు గంటలు దాటిన తర్వాత శిరివెళ్లమెట్ట వద్దకు చేరుకుంది. ఈ సమయంలో బస్సు టైరు ఒక్కసారిగా పేలడంతో డ్రైవర్ వాహనంపై నియంత్రణ కోల్పోయాడు. అదుపుతప్పిన బస్సు డివైడర్‌ను దాటి ఎదురుగా వస్తున్న కంటైనర్ లారీని బలంగా ఢీకొంది. ఢీకొన్న వెంటనే బస్సుకు మంటలు చెలరేగి క్షణాల్లోనే దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌తో పాటు లారీ డ్రైవర్, క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందారు.

